సాక్షి
ప్రకాశం
బుధవారం । 1 । మే । 2024


మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన చెవిరెడ్డి, సురేష్, బాలినేని


అభిమాన నేతను స్వాగతిస్తూ..

టంగుటూరు సభకు హాజరైన జనసమూహం, అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



జయహో జగనన్న..


సుధా..తొందరగా పద.. బైక్‌పై చెవిరెడ్డి భాస్కరరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు


అన్నను చూసిన ఆనందంలో..


జగనన్నా.. ఇటు చూడన్నా..


మేము సిద్ధం.. పార్టీ జెండా, సింబల్, మాస్కులతో..


మామకు హాయ్ చెబుతూ..


చేతిలో సెల్‌ఫోన్..కేరింతలు


ఉరిమే ఉత్సాహంతో..


పూలాభిమానం

పెళపెళమంటూ మండే ఎండ.. నిప్పులు కురిసే వేళ.. టంగుటూరును జన ఉప్పెన ముంచెత్తింది. జగన్న అభిమానం ముందు భానుడి ప్రతాపం చిన్నబోయింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా జననేత కోసం కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకూ జరిగిన రోడ్‌లో భారీగా తరలివచ్చిన అభిమానులు జయహో జగన్.. జయం జయం .. సీఎం..సీఎం అంటూ చేసిన నినాదాలతో దద్దరిల్లిపోయింది. అభిమానులు కురిపించిన పూల వానతో సీఎం కారు, కాన్వాయ్ పుష్పమయమైంది. జగన్‌మోహన్‌రెడ్డి వాహనంపైకి ఎక్కగానే ఒక్కసారిగా జనం కేరింతలతో హోరెత్తిపోయింది.

- దద్దరిల్లిన టంగుటూరు
- నిప్పులు కురిసే వేళ పోటెత్తిన అభిమానం
- దారులన్నీ జన ఉప్పెనగా మారిన వైనం
- సీఎం ప్రతి మాటకు సిద్ధం.. సిద్ధం అంటూ జనం ప్రతి స్పందన
- వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార సాంగ్స్ కు అనుగుణంగా పూనకంతో నృత్యాలు

టంగుటూరు: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం టంగుటూరుకు వచ్చారు. బొమ్మల సెంటర్లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ లో పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఉదయం 11:22 గంటలకు టంగుటూరు జూనో బేకరీ దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి 11: 27 గంటలకు రోడ్ షోగా బయలుదేరి న్యూ ద్వారక హోటల్ ఎదురు ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దారి పొడువునా జనం నీరాజనం పలికారు. పూల వర్షం కురిపించారు. సీఎం కారుతో పాటు, కాన్వాయ్ పూలతో నిండిపోయింది. జై జగన్, సీఎం జిందాబాద్ నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. ఇసుక వేస్తే రాలనంతగా తరలివచ్చిన జనంతో రహదారి కిక్కిరిసిపోయింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా సంక్షేమ సారథి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని చూసేందుకు బారులు తీరారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో ''జై జగన్ జై జగన్, సీఎం సీఎం'' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.


చంద్రబాబును మేం నమ్మమంటూ చేతులు ఊపుతున్న ప్రజలు

చంద్రబాబును నమ్మం..

అశేష జనవాహినిని ఉద్దేశించి సీఎం జగన్ ప్రసంగిస్తూ ''చంద్రబాబు పథకాలను నమ్ముతారా. గతంలో ఎన్నో పథకాలు చెప్పాడు. ఒక్కటి కూడా నెరవేర్చలేదు. అట్లాంటి వ్యక్తి సూపర్ సిక్స్, సెవన్ అంటూ మాట్లాడుతున్నాడు అవన్నీ అమలు చేస్తాడని మీకు నమ్మకం ఉందా..'' అని జగన్‌మోహన్‌రెడ్డి అనగానే ''మేము నమ్మం.. మేము నమ్మం'' అంటూ పెద్ద ఎత్తున నినదించారు. వలంటీర్లు ఉగ్రవాదులంటూ ఎన్నో ఆరోపణలు చేశాడు. ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాయించి ఎన్నికల సమయంలో వారిని తొలగించారు. తర్వాత తన తప్పును తెలుసుకుని మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లను తీసుకుంటామంటున్నాడు.. చంద్రబాబు మాయమాటలు నమ్మటానికి ప్రజలు సిద్ధంగా లేరు అనగానే ''మోసకారి బాబును నమ్మమంటూ'' జనం సమాధాన మిచ్చారు.

మేం సిద్ధం..

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌లను పరిచయం చేశారు. నా ఎడమ వైపున సురేషన్న ఉన్నాడు. ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ అందరి ముందుకు వస్తున్నాడు. మంచివాడు, సౌమ్యుడు మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు సురేషన్న పై ఉంచాలని కోరుతున్నాను. తరువాత నా కుడి పక్క భాస్కరన్న ఉన్నాడు. ఎంపీ అభ్యర్థిగా మీ అందరి సమక్షంలోకి వస్తున్నాడు. మంచివాడు, సౌమ్యుడు. మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు భాస్కరన్న పై ఉంచాలని కోరుతున్నాను అని చెప్పి ప్రజలకు వీరిద్దరినీ పరిచయం చేసి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఇద్దరూ మంచి వారు ఇద్దరినీ గెలిపించడానికి సిద్ధమా అని అనగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. ఫ్యాన్ ఇంట్లో ఉండాలి, ప్రజలకు చెడు చేసిన సైకిల్ వీధిలో ఉండాలి, తాగేసిన గ్లాస్ సింక్‌లోనే ఉండాలి అన్నప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. వైఎస్సార్ సీపీని గెలిపించుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ సీఎంకు మద్దతుగా నిలిచారు. వేదికపై ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి, కొండపి నియోజకవర్గం లోని ఆరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్యే అన్నా రాంబాబు, అద్దంకి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పాణెం హనిమిరెడ్డి, మారం వెంకారెడ్డి, , వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, టంగుటూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, టంగుటూరు సొసైటీ అధ్యక్షుడు రావూరి ప్రవీణ్‌కుమార్, తదితరులు స్వాగతం పలికారు.


మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

జనం మెచ్చేలా పనిచేస్తా..

- వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఈ ప్రాంత ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం ఎలా ఉంటుందో రాబోయే రోజుల్లో మీరే చూడబోతున్నారు.. జనం మెచ్చేలా పనిచేస్తానని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరులో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో చెవిరెడ్డి మాట్లాడారు. ప్రతిపక్షాలు అనేక జెండాలతో కలిసి వస్తున్నారని విమర్శించారు. మనం మాటిస్తే నిలబడే నాయకుడి నీడలో ఉన్నామని.. అదే టీడీపీ నాయకుడు చంద్రబాబు మాటిస్తే మాటమీద నిలబడతాడని చెప్పే ధైర్యం ఆ పార్టీ కార్యకర్తలకు ఉందా అని ప్రశ్నించారు. మీరంతా అభిమానం, ఆత్మీయత చూపుతూ నన్ను మీ కుటుంబ సభ్యునిగా ఆదరిస్తున్నారని.. మీకు రుణపడి ఉంటానన్నారు. తనకు మూడు తరాల వైఎస్ కుటుంబంతో అనుబంధం ఉందని చెప్పారు. తాను అందరిలా ఐదేళ్లకు ఒకసారి పార్టీ మారే నైజం కాదని..అప్పుడూ.. ఇప్పుడూ వైఎస్ కుటుంబంతోనే ఉన్నానన్నారు. జగనన్న పాలనలో ప్రతి పేదవానికి మేలు జరిగిందని, అటువంటి నాయకుడిని మనమందరం కాపాడుకోవాలన్నారు. ఈసారి కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలన్నకసి, పట్టుదల మీలో చూస్తున్నానని.. గతం లోలాగా ఈసారి తప్పు జరగకుండా ప్రతి ఒక్కరూ విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా ఆదిమూలపు సురేష్‌ను, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా నన్ను గెలిపించాలని కోరారు.

జగనన్న పోరాటం పేదరికంపైనే..

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలో పేదరికం రూపుమాపేందుకు జగనన్న పోరాడుతున్నారని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. టంగుటూరులో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో మంత్రి మాట్లాడారు. ఈ ఎన్నికలు నీతి, నిజాయితీ, నిబద్ధతతో పేదల పక్షాన నిలబడిన జగనన్న నాయకత్వానికి.. కులాల మధ్య చిచ్చు పెడుతూ పొత్తులపై, సామాజిక వర్గాలపై ఆధారపడి అధికారం కోసం ఆరాటపడే తోడేళ్ల గుంపునకు మధ్య జరుగుతున్నాయన్నారు. సింహంలా సింగిల్‌గా వస్తున్న జగనన్న ఒక్కడే ఒక వైపు ఉంటే ప్రతిపక్షాలన్నీ సమష్టిగా తోడేళ్ల గుంపులాగా జగనన్న పై యుద్ధం ప్రకటించి పోరాడుతున్నాయని విమర్శించారు. సంక్షేమ పథకాలు ప్రతి పేదవానికి అందాలంటే రెండో సారి జగనన్నను గెలిపించుకునేందుకు కృషి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరోనా వంటి విపత్తులు వచ్చినా ఎన్ని కష్టాలు పడ్డా సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా అలసత్వం చూపలేదని, అవినీతి రహితంగా గ్రామ సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు అందించారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల నాయకులను అక్కున చేర్చుకున్న మంచి వ్యక్తి జగనన్న అని అన్నారు. చంద్రబాబు దళితులుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అంటాడని.. అటువంటి వ్యక్తి సామాజిక న్యాయం, సాధికారత పై మాట్లాడటం


మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

సిగ్గుచేటన్నారు. విజయవాడ నడిబొడ్డున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి మనల్ని తలఎత్తుకునేలా చేసిన గొప్ప వ్యక్తి జగనన్న అని ప్రశంసించారు. తండ్రి వైఎస్సార్ ఒక అడుగు వేస్తే కొడుకు జగనన్న నాలుగు అడుగులు వేసి పేదల సంక్షేమం కోసం 24 పథకాలను ప్రవేశపెట్టి 2 లక్షల 76 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రతిపేదవాని బ్యాంకు ఖాతాలో 130 సార్లు బటన్ నొక్కి నగదు జమచేశాడని అన్నారు. 500 కు పైగా హామీలు ఇచ్చి అమలు చేయని నాయకుడు చంద్రబాబు అని ఆరోపించారు. 2014లో డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి విస్మరించాడని ఎద్దేవా చేశారు. ఆడవాళ్ల ఉసురు పోసుకున్నవారు ఎవరూ బాగు పడరని, అందుకే 2019 ఎన్నికల్లో 23 సీట్లకే మహిళలు పరిమితం చేశారన్నారు. కొండపిలో ఈసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరటమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇందుకోసం ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అదనపు బ్యాలెట్లకు తొలి విడత ర్యాండమైజేషన్



ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలకు అదనంగా పంపే బ్యాలెట్ యూనిట్లకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మొదటి విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ రాజకీయ పార్టీల సమక్షంలో ప్రకాశం భవనంలో మంగళవారం నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు 15 మందికి మించి ఉండటం వల్ల కంట్రోల్ యూనిట్లకు రెండవ బ్యాలెట్‌ను అనుసంధానం చేయాల్సి ఉండటంతో అదనపు బ్యాలెట్లను ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఒంగోలు లోక్‌సభ, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా నామినేషన్ల అనంతరం 15 మంది అభ్యర్థుల కంటే ఎక్కువగా ఉన్నా, బ్యాలెట్ యూనిట్‌లు అందుబాటులో లేకపోవడంతో వాటిని సమకూర్చేందుకు ప్రత్యేక సిబ్బంది మంగళవారం బెంగళూరులోని బెల్ సంస్థ వద్దకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు, వారి ప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను కలెక్టర్ అందజేశారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు, లోక్‌సభకు పోటీ చేస్తున్న అభ్యర్థుల ఆధ్వర్యంలో ఈవీఎం గోదాము తెరిచి బ్యాలెట్ యూనిట్లను ఆయా నియోజకవర్గాలకు పంపారు. బెంగళూరు నుంచి అదనపు బ్యాలెట్ రాగానే గురువారం ఎఫ్ఎల్‌సీ నిర్వహించి ర్యాండమైజేషన్ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. దీనిలో వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషాబేగ్, రసూల్, కోటేశ్వరరావు, బీ రాజశేఖర్, ఎన్నికల పోటీలో ఉన్న పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎన్నికలపై మద్యం ప్రభావం లేకుండా చూడండి



సిబ్బందితో సమీక్షిస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు

చీమకుర్తి: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలపై మద్యం ప్రభావం లేకుండా చూడాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ కే హేమంత్ నాగరాజు సూచించారు. మంగళవారం చీమకుర్తిలోని సెబ్ స్టేషన్‌ను డిప్యూటీ కమిషనర్ సందర్శించారు. మద్యం నిల్వలు, గోడౌన్‌లలో అనుమానిత ప్రాంతాలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం కేసుల్లో నిందితులు, పెండింగ్ కేసుల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగే విధంగా సెబ్ సిబ్బంది తమ వంతు కృషి చేయాలని సూచించారు. సెబ్‌స్టేషన్ సీఐ మారయ్యబాబు, ఎస్సై వినీతరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సామగ్రి దుకాణంలో అగ్ని ప్రమాదం



దుకాణంలో వ్యాపించిన మంటలు

పొదిలి: స్థానిక విశ్వనాథపురం బస్టాండ్ ఆవరణలో విద్యుత్ సామానుల దుకాణంలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న ఆర్టీసీ ఆన్‌లైన్ సెంటర్‌కు కూడా మంటలు వ్యాపించటంతో అక్కడున్న కంప్యూటర్లు, నగదు కాలిపోయినట్లు నిర్వాహకులు తెలిపారు. విధుల్లో ఉన్న హోంగార్డు సింగారెడ్డి రంగారెడ్డి, గూడూరి వినోద్, సురేష్‌లు ఇరుగుపొరుగు వారి సాయంతో మంటలు అదుపు చేశారు. లేకుంటే మరింత నష్టం జరిగి ఉండేది. అప్పటికే సుమారు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం జరిగి ఉంటుందని దుకాణ యజమాని తెలిపారు.

పేదరికాన్ని నిర్మూలించేలా మేనిఫెస్టో

- మళ్లీ ఐదేళ్ల పాటు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు
- ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలి
- మడనూరులో గత ఐదేళ్లలో రూ.47.69 కోట్లతో సంక్షేమ పథకాలు
- గ్రామంలో రోడ్ షో నిర్వహించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- అడుగడుగునా జననీరాజనం



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి హారతిస్తున్న మహిళలు



బాలినేని రోడ్ షోలో భారీగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్థానిక ప్రజలు

మడనూరు (కొత్తపట్నం): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన 2024 ఎన్నికల వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో పేదరికం నిర్మూలించేలా ఉందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తపట్నం మండలంలోని మడనూరు గ్రామంలో మంగళవారం రోడ్ షో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్థానిక ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ శాలువాలతో సన్మానించి హారతులిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్సార్ సీపీ జెండాలతో కదం తొక్కారు. బాలినేని ప్రచార రథాన్ని ఆపి గుమ్మడికాయలతో దిగదుడిచి దిష్టి తీశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో అన్ని సామాజికవర్గాలకు ఉపయోగపడుతుందన్నారు. ఇప్పుడు అందరికీ ఏ విధంగా ఇంటికే పథకాలు వస్తున్నాయో.. అదేవిధంగా వచ్చే ఐదేళ్లు కూడా వస్తాయని తెలిపారు. మడనూరులోని రెండు గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలకు గత ఐదేళ్లలో రూ.47.69 కోట్ల విలువైన సంక్షేమ పథకాలను అమలు చేసి బ్యాంక్ అకౌంట్లలో నగదు జమ చేసినట్లు బాలినేని వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి ఉచితంగా మంచి నీటి కుళాయిలు బిగించడం జరిగిందన్నారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో వచ్చే భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచి ఇచ్చామన్నారు. ఆయిల్ సబ్సిడీ, సముద్ర వేట సమయంలో ప్రమాదశావత్తూ మరణిస్తే రూ.10 లక్షలు వంటి పథకాలను విజయవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి వంటి పథకాలు అమలు చేయడం ద్వారా ఆర్థికంగా అందరూ ఎదుగుతున్నారని తెలిపారు. 34 రకాల సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేశారని వివరించారు. ఇవన్నీ మళ్లీ అమలు చేయాలంటే వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని బాలినేని విజ్ఞప్తి చేశారు. 2020లో ఈతముక్కల బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి దగ్గర ప్రమాదం జరిగి ఎస్సీ కాలనీలో ఏడుగురు మరణిస్తే వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు వచ్చే విధంగా కృషి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా బాలినేని గుర్తుచేశారు. ఎవరికి ఆపద వచ్చినా ఆదుకున్నానని తెలిపారు. బస్టాండ్ సెంటర్ నుంచి చాకలిపాలెం, చిన్న, పెద్ద, స్వర్ణాంధ్రపట్టపుపాలేలు, ముస్లింకాలనీ, ఎస్సీకాలనీ, తోటగుంట యానాది కాలనీ, మెల్లిలదిబ్బ యానాది కాలనీలో రోడ్ షో నిర్వహించారు. ఎస్సీకాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టపుపాలెం, కాలనీల్లో ఉన్న రామాలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, గొర్రెపాటి శ్రీను, మాజీ ఎంపీపీలు వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి, సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ వెంకట్రావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బద్దేల ప్రమోద్‌రెడ్డి, సుధాకర్, బిల్లా చెన్నయ్య, ఏసురత్నం, తమలపాకులు కిషోర్, చక్రవర్తి, వాయల అంజిబాబు, ప్రళయకావేరి కొండయ్య పాల్గొన్నారు.

జననేత పాలనకు జై కొడదాం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్, పక్కన మంత్రి మేరుగు నాగార్జున



వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ బీసీ నాయకుడు రాజాను ఆహ్వానిస్తున్న మంత్రి మేరుగు, ఎంపీ నందిగం

- ఎన్నికల ప్రచారంలో మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్
- నాగులుప్పలపాడు మండలంలో కోలాహలంగా ఎన్నికల ప్రచారం
- అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం

నాగులుప్పలపాడు: పేద వాడు అనే పేరు వినిపించకుండా పరిపాలన సాగించడమే లక్ష్యంగా ముందుకు సాగుతూ అందరి హృదయాలలో జననేతగా పేరొందిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి నాగులుప్పలపాడు మండలంలోని దాసరివారిపాలెం, వినోదరాయునిపాలెం, కండ్లగుంట, కొత్తకోట గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, గ్రామస్తులు అడుగడుగునా వారికి నీరాజనాలు పలికారు. తమ కుటుంబాలకు అండదండగా ఉంటున్న ముఖ్యమంత్రి జగన్ ప్రతినిధులుగా వచ్చిన వారికి పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ చిగురుటాకు వయసులో ఏ ఒక్కరూ కష్టపడకూడదని, తమకెవ్వరూ లేరనే భావనలో ఏ ఒక్క అవ్వాతాత ఉండకూడదని వారి బాగోగులు ఇంటి వద్దకే వచ్చి చూసుకునేలా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన ప్రజానేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన పాలనపై నిరంతరం ఎల్లో మీడియా విషం కక్కుతూ ప్రజలకు మేలు చేస్తున్న వ్యవస్థలపై కూడా కుట్రలు పన్నడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులు పడుతున్న వెతలు చూసి కూటమి నాయకులు నవ్వుకుంటున్నారని, అలాంటి వారి ఆటలు కట్టించడానికి మనందరం ఐక్యంగా పేదల పక్షాన నిలిచే ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు.

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ మాట్లాడుతూ సామాన్యులను కూడా చట్టసభలకు పంపాలన్న మహాసంకల్పంతో పనిచేస్తున్న జగనన్న.. తన లాంటి వారితో పాటు చాలా మంది జీవితాలలో వెలుగులు నింపారన్నారు. ఎన్నికల తర్వాత మొదటి పార్లమెంట్ నిధులతోనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు నిధులు అందిస్తానన్నారు. సీఎం జగన్ పాలనపై ప్రతిఒక్కరూ చాలా సంతోషంగా ఉన్నారని, తిరిగి ఆయనను ముఖ్యమంత్రిని చేయాలంటే ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా నాగార్జున అన్నను గెలిపించి జగనన్నకు కానుకగా అందిద్దామని అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ బీసీ నాయకుడు రాజా...

కండ్లగుంట గ్రామంలో బీసీ నాయకుడు రాచపూడి రాజా టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరగా, మంత్రి మేరుగు నాగార్జున పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, యాదాల అశోక్ బాబు, ఘట్టమనేని అశోక్, కత్తి శివ, సుబ్బారావు, పల్లెర్ల అంజిరెడ్డి, ఈమని అంజిరెడ్డి, పాలపర్తి రత్తయ్య, చిన్నం సుజాత సురేష్, యరమాల యోహాను, వీరాస్వామిరెడ్డి, యరమాల సుభాషిణి, పురం ఆంజనేయులు, రాజు, పాలపర్తి మధు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ దుర్గాదేవి



జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ దుర్గాదేవి

ఒంగోలు టౌన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.దుర్గాదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ భగవాన్ నాయక్ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో దుర్గాదేవి బాధ్యతలు చేపట్టారు. బెంగళూరులోని ప్రతిష్టాత్మక రామయ్య మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆమె.. సైకాలజీలో ఎండీ చేశారు. కొంతకాలంగా ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హనుమంతరావు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మంజుల, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ తిరుమలరావు, ఏఆర్ఎంఓ డాక్టర్ అనిల్, ఏడీ లక్ష్మీకుమారి, ఏఓ రమణమ్మ, డాక్టర్ చైతన్య తదితరులు ఆమెను అభినందించారు. దుర్గాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం ఎక్కువగా నిరుపేద ప్రజలే వస్తుంటారని, వైద్యులు, సిబ్బంది సహకారంతో వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

యర్రగొండపాలెంలో గ్లాసు గుర్తు మాయం

- ఎన్నికల నిర్వహణాధికారి తీరుపై ఆరోపణలు
- చివరి నిముషంలో విత్‌డ్రా చేసుకున్న ఇండిపెండెంట్
- ఇదేంటని ప్రశ్నిస్తే కేసులు పెడతామంటూ బెదిరింపులు

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం నియోజకవర్గంలో గ్లాస్ గుర్తు విషయంలో ఎన్నికల అధికారులు వ్యవహరించిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యే నాటికి యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి 18 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు కాకుండా ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేసిన నలుగురు అభ్యర్థులు గ్లాస్ గుర్తును కోరుకున్నారు. ముగ్గురు అభ్యర్థులు విత్ డ్రా చేసుకున్నట్లయితే ఒక ఈవీఎంతో ఎన్నికలు జరపటానికి సులువుగా ఉంటుందని ఆర్వో శ్రీలేఖ ప్రధాన పార్టీలకు చెందిన ఎన్నికల చీఫ్ ఏజెంట్‌లు, అభ్యర్థులతో చర్చలు జరిపారు. ఒక ఈవీఎంలో నోటాతో కలుపుకుని 16 గుర్తులు పెట్టుకునే అవకాశం ఉందని, అంతకు మించి అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎం ఉపయోగించాల్సి ఉంటుందని ఆమె వివరించారు. ఒక రోజు ముందుగా (ఆదివారం) ఆర్వో తన సహాయకులతో సెల్ ద్వారా వైఎస్సార్ సీపీ అభ్యర్థి చీఫ్ ఏజెంట్‌తో చర్చలు జరిపారు. పరిస్థితులను బట్టి ఇండిపెండెంట్లతో విత్ డ్రా చేయించేందుకు ప్రయత్నిస్తానని ఆయన బదులిచ్చినట్లు తెలిసింది. ఆ తరువాత విత్ డ్రా చేసుకోవటానికి తమకు ఇష్టం లేకపోయినప్పటికీ చేసేదిలేక కొంతమంది ఇండిపెండెంట్‌లు సుముఖత చూపారు. తమకు అనుకూలమైన వారితో విత్ డ్రా చేయించాలని వైఎస్సార్ సీపీ అభ్యర్థి చీఫ్ ఏజెంట్‌పై ఆర్వో తీవ్ర ఒత్తిడి చేశారు. ప్రయార్టీ ప్రకారం గ్లాస్ గుర్తు ఒక ఇండిపెండెంట్ అభ్యర్థికి కేటాయించాల్సి ఉంది. ఈ గుర్తు తమకు దక్కదన్న ఉద్దేశంతో ముగ్గురు ఇండిపెండెంట్‌లు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకున్నారు. ఏజెంట్లు, అభ్యర్థులు ఒక గదిలో కూర్చొని ఉండగా నిర్దేశించిన సమయం పూర్తయ్యే వరకు టైం పాస్ చేసేందుకు ఆర్వో వారి వద్దకు వెళ్లి ఎన్నికలు జాగ్రత్తగా నిర్వహించుకునేలా చూసుకోవాలని, ఖర్చు తగ్గించుకోవాలని హితోపదేశం చేసి బయటకి వెళ్తూ ఆ గది తలుపులు వేశారు. అనుమానం వచ్చిన వారు ఆర్వో గది వద్దకు వెళ్లేలోపు చివరి నిమిషం (2.58 గంటలకు)లో గ్లాస్ గుర్తుకు అర్హత ఉన్న అభ్యర్థి ఆర్వో వద్దకు వెళ్లి తాను కూడా విత్ డ్రా చేసుకున్నారు. దీంతో గ్లాస్ గుర్తు ఈవీఎంలో మాయమైంది. గ్లాసు గుర్తు మాయం వెనుక ఎన్నికల అధికారి వ్యవహరించిన తీరుపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక ఈవీఎంకు సరిపడా అభ్యర్థులున్నా గ్లాసు గుర్తు వచ్చే అభ్యర్థి విషయంలో లోపాయికారిగా వ్యవహరించి ఏమైనా కుట్ర చేశారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని రాజకీయ పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఏజెంట్ ప్రశ్నిస్తే పోలీసు కేసు పెట్టాల్సి వస్తుందని ఆర్వో బెదిరింపులకు దిగినట్లు ఆయన ఆరోపించారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- శాంతి భద్రతలకు విఘాతం కలిగితే సహించేది లేదు
- గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి



ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో సమీక్షిస్తున్న రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి

ఒంగోలు సబర్బన్: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. జిల్లాకు వచ్చిన ఆయన మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో కలిసి పోలీస్ ఉన్నతాధికారులు, జిల్లాలోని పోలీస్ నోడల్ అధికారులు, కేంద్ర సాయుధ బలగాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాపై పట్టు సాధించాలని సూచించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించటంతో పాటు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే విధంగా ఓటర్లకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగానే విధులు నిర్వర్తించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘన కేసులు, ఎన్‌బీడబ్ల్యూలు, బైండోవర్ కేసులు, కమ్యూనికేషన్ వివరాల గురించి ఆరా తీశారు. ఎన్నికల సందర్భంగా డిపాజిట్ చేసిన ఆయుధాల వివరాలు, గత ఎన్నికల్లో నమోదైన కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై చెన్నకేశవుడు

- ఆకట్టుకున్న ప్రదర్శనలు
- నేడు చెన్నకేశవుని రథోత్సవం



మహావిష్ణువు అలంకారంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి, నగరోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి గరుడవాహనోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. మంగళవారం తెల్లవారుజామున గరుడ వాహనంపై మహావిష్ణువు అలంకారంలో చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి గరుత్మంతుడు ఇష్టమైన భక్తుడని, గరుత్మంతుడే శ్రీమహావిష్ణువుకు నిత్యవాహనం. గరుడోత్సవం రోజున మహావిష్ణువు అలంకారణలో చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కుటుంబసభ్యులు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు, పురప్రముఖులు, అధికారులు, ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామికి అత్యంత వైభవంగా రథోత్సవంను బుధవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులు రథోత్సవంలో పాల్గొని స్వామిని దర్శించుకుని జయప్రదం చేయాలని కోరారు.

విలువలు, విశ్వసనీయతే జగనన్న ఆయుధం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాంబాబు, శ్రావణి వెంకటేశ్వర్లు

- ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు
- శ్రావణి ఆధ్వర్యంలో 200 మంది పార్టీలో చేరిక

పొదిలి: విలువలు, విశ్వసనీయతను ఆయుధంగా చేసుకుని జగనన్న పాలన సాగిస్తున్నారని మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని కాటూరివారిపాలెంలో శ్రావణి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 200 మంది రాంబాబు సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగు న్యాయం చేస్తామన్నారు. రాజకీయాల్లో చెప్పిందే చేయటం, చేయలేనిది చెప్పకపోవటంతో జగనన్నపై ప్రజల్లో విశ్వసనీయత పెరిగిందన్నారు. దీంతో పార్టీలో చేరికలు వెల్లువలా సాగుతున్నాయన్నారు. ఏమాత్రం ఆచరణ సాధ్యం కానీ హామీలను మేనిఫెస్టోలో పెట్టి మరోమారు మోసం చేసేందుకు కూటమి నాయకులు సిద్ధం అవుతున్నారన్నారు. వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. జగనన్న ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలతో సంక్షేమం మరింత మెరుగవుతుందన్నారు. చెప్పుకోవటానికి ఏమీ లేక చంద్రబాబు రెచ్చగొట్టే ఉపన్యాసాలతో కాలం గడుపుతున్నారన్నారు. ఓటమి భయం వారి ముఖాల్లో కనిపిస్తుందన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి తనకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి, వేయించి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో కుంచాల సంజీవ, మాజీ ఎంపీటీసీ వల్లెపు రాఘవులు, కోనంక శ్యాంసన్, మాజీ వార్డు సభ్యులు రఘురామయ్య, యుద్దం శ్రీను, సిరిగిరి వెంకటేశ్వర్లు, వెంకట నారాయణ, పాలగిరి రామకృష్ణయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి జి.చెన్నారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, వెలిశెట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



దగాకోరు హామీదారు

2014లో చంద్రబాబును నమ్మి దగాపడిన రైతులు.. దివాళా దిశగా పొదుపు సంఘాలు
అధికార యావతో మళ్లీ అడ్డగోలు హామీలు – కిచిడీ మేనిఫెస్టోను నమ్మలేమంటున్న జనం

ప్రజలకు మాట ఇస్తే అందుకు కట్టుబడాలి.. విలువలు, విశ్వసనీయతతో పాలన సాగించాలి.. ఇది పాలకుల ధర్మం. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతుంటే.. రాష్ట్రాన్ని 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు మాత్రం వెబ్‌సైట్ నుంచి టీడీపీ మేనిఫెస్టోనే మాయం చేశారు. అధికార పీఠం కోసం అడ్డదారులను ఆశ్రయించడం, ప్రజలకు మాయమాటలు చెప్పి ఆపై మరిచిపోవడం, అడ్డగోలుగా హామీలిచ్చి తాము అలా అనలేదని అసెంబ్లీ సాక్షిగా నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పడం టీడీపీ అధినేత చంద్రబాబుకే చెల్లింది. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ చంద్రబాబు తన అబద్ధాలను అందంగా రంగరించి ప్రజలను నమ్మించేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

హామీలు ఆరు శతకాలు.. ఘోరంగా అమలు

2014 ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలో చంద్రబాబు పేర్కొన్న హామీలు 600కు పైమాటే. చంద్రబాబు ఇచ్చిన రుణమాఫీ హామీని నమ్మి అన్నదాతలు, డ్వాక్రా మహిళలు దగా పడ్డారు. యువతకు నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించి తీరా 2019 ఎన్నికల ముందు టీడీపీ కార్యకర్తలైన కొందరి బ్యాంకు ఖాతాల్లో రూ.వెయ్యి చొప్పున నగదు జమ చేయడం చంద్రబాబు మోసపూరిత వైఖరికి నిదర్శనంగా నిలిచింది. ప్రధానమైన హామీలతో సహా సామాజిక వర్గాల వారీగా ఇచ్చిన వాటినీ చంద్రబాబు తుంగలో తొక్కడంపై ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తూ, నిరసనలు తెలపడంతో ఏకంగా మేనిఫెస్టోను టీడీపీ వెబ్‌సైట్ నుంచి మాయం చేశారు. 2019లోనూ ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చినా ప్రజలు ఘోరంగా ఓడించారు.

అన్నదాతలకు రుణ మాఫీ పోటు

'తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే, పూ..ర్తిగా రుణ మాఫీ చేస్తామని మీకు మాట ఇస్తున్నా. డ్వాక్రా రుణాలు బ్యాంకులకు కట్టొద్దు. మనం రాగానే అప్పు మొత్తం మాఫీ చేసే బాధ్యత నాది' అంటూ 2014లో దీర్ఘాలు తీసి చెప్పారు టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు. బాబు ఇచ్చిన హామీలకు పూచీ నాది అని పవన్‌కళ్యాణ్ సైతం ప్రచారం చేశారు. తీరా గద్దెనెక్కిన తర్వాత రుణమాఫీ హామీపై చంద్రబాబు నాలుక మడతేశారు. రుణమాఫీని ఐదు విడతల్లో చేస్తామని, అదికూడా 1.50 లక్షల వరకే వర్తిస్తుందని చంద్రబాబు బాంబు పేల్చడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. జిల్లాలో 3,71,484 మంది రైతులు రుణమాఫీకి అర్హత సాధించగా వీరికి అందించాల్సిన రూ.8,830 కోట్ల సొమ్ముకు నిబంధనల పేరుతో కత్తెర వేసి రూ.వెయ్యి కోట్లు కూడా ఇవ్వకుండా చేతులెత్తేశారు. బాబు దిగిపోయే నాటికి పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.2,200 కోట్లు, విత్తనాల సబ్సిడీ సొమ్ము రూ.800 కోట్లు, మొక్కజొన్న కొనుగోళ్ల బోనస్ రూ.200 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. తాజాగా టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలపైనా రైతులు పెదవి విరుస్తున్నారు.

మోసపోయిన డ్వాక్రా మహిళలు

బేషరతుగా డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేయడంతో జిల్లాలోని డ్వాక్రా అక్కచెల్లెమ్మలు గగ్గోలు పెట్టారు. నాడు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 10 క్లస్టర్లలో 50,923 డ్వాక్రా సంఘాలకు చెందిన 5,02,077 మంది సభ్యులకు పూర్తిగా రుణమాఫీ చేయకుండా రెండు విడతల్లో పసుపు కుంకుమ కింద రూ.వేలు ఇచ్చారు. మూడో విడత రూ.200,83,08,000 మంజూరు చేయకుండా కొర్రీలు పెట్టారు. మహిళలకు వడ్డీలేని రుణాలు 2016 తర్వాత ప్రభుత్వం అందజేయలేదు. స్త్రీ నిధి రుణాల మంజూరు విషయంలోనూ మీనమేషాలు లెక్కించి డ్వాక్రా సంఘాలు దివాళా తీసే పరిస్థితికి తీసుకొచ్చారు. బాబు చేసిన మోసంతో బ్యాంకులకు వడ్డీ మీద వడ్డీ చెల్లించాల్సి వచ్చిందని నేటికీ డ్వాక్రా మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. మహిళలందరికీ రూ.1500 ఇస్తామని చంద్రబాబు తాజా మేనిఫెస్టోలో ప్రకటించడం బూటకమేనని అభిప్రాయపడుతున్నారు.

సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్..

చంద్రబాబు ఈసారి రూటు మార్చారు. కర్నాటక, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీలను కాపీ కొట్టిన చంద్రబాబు గతంలో తాను ఇచ్చిన హామీలనే కొత్తగా చెబుతూ కిచిడీ మేనిఫెస్టో రూపొందించారు. నిరుద్యోగ భృతి పేరుతో గతంలో దగా చేసిన బాబు మళ్లీ పాత పాటే కొత్తగా పాడారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న అమ్మ ఒడి, రైతు భరోసా పథకాలను కాపీ కొట్టారు. తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో అమలు సాధ్యం కాని మూడు సిలిండర్ల హామీని, ఆటోవాలాలు, మహిళల నుంచి సైతం తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదర్కొంటున్న ఉచిత బస్సు సౌకర్యాన్ని బాబు కాపీ కొట్టి గొప్పగా ప్రచారం చేసుకోవడాన్ని చూసి ప్రజలు యావగించుకుంటున్నారు.



రైతు సంక్షేమం రుణమాఫీ లాంటిదే..

చంద్రబాబు హామీలు అంటే నీటిమీద రాతలే. 2014లో రైతులకు భేషరతుగా రుణమాఫీ చేస్తానని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక రూ.1.50 లక్షలకు కుదించారు. పోనీ అదైనా చేశాడా అంటే లేదు. కొందరికి రెండు, మూడు విడతలు వేశాడు. నాకు రెండు విడతలుగా రూ.28,688 వచ్చాయి. అవి వడ్డీలకు కూడా సరిపోలేదు. ఇప్పుడు రూ.20 వేలు ఇస్తానంటే ఎలా నమ్మాలి?

– బైరెడ్డి నారాయణరెడ్డి, పీవీ పురం(బేస్తవారిపేట)



అబద్ధాలకు బ్రాండ్.. నమ్మినోళ్లకు బ్యాండ్

సాక్షి నెట్‌వర్క్

మళ్లీ మోసపోలేం



చంద్రబాబు నిరుద్యోగ భృతి హామీని 2019 ఎన్నికలకు మూడు నెలల ముందు అమలు చేశారు. అంతకు ముందు ఉద్యోగాలు లేవు, భృతి ఇవ్వలేదు. సీఎం వైఎస్ జగన్ మాత్రం సచివాలయ వ్యవస్థతో 1.40 లక్షల ఉద్యోగాలు, కానిస్టేబుల్ పోస్టులు 6100, డీఎస్సీలో 13 వేల పోస్టులు, వైద్యశాఖలో 50 వేల మందికిపైగా సిబ్బందిని నియమించారు. మళ్లీ ఇప్పుడు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తానని చంద్రబాబు చెప్పడం మోసమే.

– హుసేన్, గొట్లగట్టు(కొనకనమిట్ల)

జగన్ స్థలమిస్తే సమాధులకా అన్నారుగా



చంద్రబాబు ఏనాడూ పేదలకు సెంటు స్థలం ఇవ్వలేదు కానీ జగన్ స్థలాలిస్తే సమాధులు కట్టుకోవడానికా అని ఎగతాళిగా మాట్లాడాడు. మా ఊర్లో జగనన్న కాలనీలో సెంటున్నర స్థలం, రూ.1.80 లక్షలు డబ్బు ఇవ్వడంతో మంచిగా ఇల్లు కట్టుకున్నా. చంద్రబాబు రెండు సెంట్లు కాదు రెండెకరాలు ఇస్తానన్నా నమ్మేవాళ్లు లేరు.

– ముట్టిపోగు కరుణకుమారి, పుచ్చకాయలపల్లి(పెద్దారవీడు)

వలంటీర్లపై బాబుది కపట ప్రేమ



చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇప్పుడున్న వలంటీర్లలో ఒక్కరిని కూడా ఉంచరు. వలంటీర్లను మూటలు మోసే వాళ్లు, ఉగ్రవాదులు, స్లీపర్‌సెల్స్ అని రోజూ తిడుతూ రూ.10 వేలు జీతం ఇస్తామంటే ఎలా నమ్ముతాం. రాబోయే ఎన్నికల్లో వలంటీర్ల సత్తా చూపిస్తాం.

– డి.యశ్వంత్, పుచ్చలమిట్ట(దర్శి)

మోసపోయేందుకు బీసీలు సిద్ధంగా లేరు



బీసీ మహిళలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తానని చంద్రబాబు చెప్పడం ఓట్ల కోసమే. అది సాధ్యమయ్యే పని కాదని వైఎస్ జగన్ చెప్పిన మాటను మేమంతా నమ్ముతున్నాం. గతంలో చంద్రబాబు ఇచ్చిన ఏ హామీని బాబు సక్రమంగా నెరవేర్చలేదు. టీడీపోళ్ల మాటలు నమ్మితే నట్టేట ముంచుతారు. బాబు చేతిలో మోసపోవడానికి బీసీలు సిద్ధంగా లేరు.

– పోటు సింగమ్మ, ధర్మవరం(మద్దిపూడి)

వలంటీర్లను మభ్యపెట్టేందుకే..



చంద్రబాబు హామీని ఒక వలంటీర్‌గా నేను నమ్మడం లేదు. వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులని రోజూ విమర్శలు చేస్తూ రూ.10 వేలు జీతం ఇస్తామంటే ఎలా నమ్ముతాం. అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ వాళ్లంతా క్షమాపణ చెప్పాలి. చంద్రబాబు కోర్టులో వేయించి పిటిషన్ వల్లే వలంటీర్లు విధులకు దూరమయ్యారు.

– విజయ్‌కుమార్, తాడివారిపల్లి(తర్లుపాడు)

చంద్రబాబు చెసేదంతా మోసమే..



నేను 20 ఏళ్లు టీడీపీలో ఉన్నా. చంద్రబాబు చెప్పే మాటల్లో ఒక్కటి కూడా నిజం లేదని అర్థమైంది. 2014లో రుణమాఫీ, నిరుద్యోగ భృతి అంటే జనం ఓట్లేసి గెలిపించారు. సీఎం అయ్యాక మోసం చేశారు. వైఎస్ జగన్ చెప్పినవన్నీ చేశారు. బాబుకు మళ్లీ ఓటేస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుంది.

– తానంచింతల చంటి, బయ్యవరం(కురిచేడు)

అంతా బూటకమే..



రైతులను మోసం చేయడం చంద్రబాబుకు ఆది నుంచి అలవాటే. ఆయన పాలనలో తీవ్రంగా నష్టపోయాం. సంపూర్ణ రుణమాఫీ అని చెప్పి మాట మార్చాడు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పేరుతో చిత్తు కాగితాలు మా చేతిలో పెట్టాడు. వాటిని బ్యాంకులో చూపితే ఎందుకూ పనికి రావని చెప్పారు. ఇప్పుడు బాబు ఎన్ని హామీలిచ్చినా రైతులు నమ్మే పరిస్థితిలో లేరు.

– జానికి రఘు, రైతు, పుల్లలచెరువు

అరెరె.. ఎంత మార్పు

నాడు



చినకండ్లగుంటలో గతంలో ఉన్న ఎంపీహెచ్‌సీ..

కొండపి(మద్దిపూడి): కొండపి మండలం చినకండ్లగుంటలో గతంలో పాడుబడిన రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న ఎంపీహెచ్‌సీ రూపురేఖలు మారాయి. అన్ని రకాల మౌలిక వసతులతో నూతన భవనం నిర్మించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు



చినకండ్లగుంట గ్రామంలో నూతనంగా సుమారు రూ.20 లక్షలు వెచ్చించి నిర్మించిన ఆరోగ్య కేంద్రం

హైరానా వద్దు.. ఇలా ఓటేయొచ్చు!



ఒంగోలు అర్బన్: ఓటు హక్కు కలిగి ఉండి ఓటరు గుర్తింపు కార్డు లేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఓటరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర ఎన్నికల సంఘం 12 రకాల గుర్తింపు కార్డులను ప్రత్యామ్నాయంగా గుర్తించింది. వాటిలో ఏదో ఒక గుర్తింపు కార్డు పోలింగ్ కేంద్రాల్లో చూపి ఓటు వేయవచ్చు.

12 రకాల కార్డులు ఇవీ.. ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎంపీఆర్ కింద ఆర్‌బీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల ద్వారా ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోతో కూడిన సేవా గుర్తింపు కార్డులు, సదరం సర్టిఫికెట్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలయితే వారికి జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు చూపి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

సమష్టిగా పనిచేద్దాం.. దద్దాల నారాయణను గెలిపిద్దాం



ఐక్యతా నినాదం చేస్తున్న దళిత, బహుజన, మైనార్టీ సంఘాల నేతలు

- వైఎస్సార్ సీపీతోనే సామాజిక సాధికారత, పేదల జీవితాల్లో వెలుగు
- చంద్రబాబు కూటమిని ఓడించడమే లక్ష్యంగా పనిచేద్దాం
- జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం
- దళిత, బహుజన, మైనార్టీ సంఘాల నాయకుల పిలుపు

కనిగిరి రూరల్: 'మనమంతా సమష్టిగా, ప్రణాళికాబద్ధంగా పనిచేద్దాం.. బీసీ వర్గానికి చెందిన దద్దాల నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం చేసుకుందాం' అని వివిధ బహుజన సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో పెన్నా వెంకటేశ్వర్లు, కటికల వెంకటరత్నం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ చింతగుంట్ల సాల్మన్ రాజు, వైస్ చైర్మన్ మాణిక్యరావు, రాష్ట్ర ఆరెకటిక కార్పొరేషన్ చైర్మన్ దాదా కుమారిలక్ష్మి, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సామాజిక సాధికారత సాధ్యమైందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యులను చేశారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉప కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఎందరికో రాజ్యాధికారంలో ఉన్నత స్థానం కల్పించారని కొనియాడారు. అసెంబ్లీ స్థానాల్లో కూడా 100కు పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, వెనుబడిక వర్గాలకు వైస్ జగన్ కేటాయించారని తెలిపారు. చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్పా.. ఎటువంటి మేలు చేయలేదని ఘాటుగా విమర్శించారు. మే 13న నిర్వహించనున్న ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలన్నీ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచి కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించడంతోపాటు జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు.

దళిత, బహుజన, మైనార్టీ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు పెన్నా వెంకటేశ్వర్లు యాదవ్, చదలవాడ బాలగురవయ్య, చీమల దిన్నె చిన వెంగయ్య, కటికల వెంకటరత్నం, చెరుకూరి చిన కాశయ్య, ద్రోణాదుల చెంచులు, కోలా విలియం, కంటు గురవయ్య, శిగా కృష్ణారావు,కే ఓబులేసు, గోనా దానయ్య మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీతోనే పేద వర్గాల అభ్యున్నతి సాకారమైందని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాలు పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కులోన్మాదం, మతోన్మాదానికి మరో రూపం అని ఘాటుగా విమర్శించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలకు రక్షణ లేకుండా పోతుందని, రిజర్వేషన్లు కూడా రద్దు చేస్తారని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు కూటమిని ఓడించడమే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలు పనిచేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీలో పేద వర్గాలకు సముచిత స్థానం లభిస్తోందన్నారు. లౌకికవాద ప్రభుత్వం ఒక్క జగన్‌కు మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బహుజన సంఘాల నాయకులు మద్దిబోయిన విద్యా యాదవ్, దేవర కొండవసంత్ కుమార్, దోసపాటి నర్సయ్య, ఎస్కే జిలానిబాషా, చింతం శ్రీనివాసుల యాదవ్, ఎస్కే ఖాజా, జీ అబ్రహం లింకన్, శ్రీరాం సతీష్, డాక్టర్ రసూల్, బత్తుల వెంకట రమణయ్య, సయ్యద్ నాయబ్ రసూల్, పొద్దుటూరి బాజీ, వేముల శివా, , మీరావలి, మండ్లా వెంకటేశ్వర్లు, వంకదారి రాజా, అన్నపురెడ్డి సాయి, రంగయ్య, ఇండ్లా రాయుడు, తోగురు పిచ్చయ్య, ఈర్ల గురవయ్య, పండు, వెంకట్రావ్, ఖాశింసా, మదారవలి తదితరులు పాల్గొన్నారు.

చెప్పిందంతా సోది.. ప్రశ్నలకు బదులేది?

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం సభ అట్టర్ ఫ్లాప్
- యువతీయువకుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక తడబడిన లోకేష్
- తొలుత యువత రాకపోవడంతో 3 గంటలపాటు బస్సుకే పరిమితం
- చిన్న ప్రాంగణాన్ని నింపలేక తంటాలు పడిన టీడీపీ నేతలు



యువగళం సభలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

ఒంగోలు సబర్బన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం సభ యువత లేకుండానే మ..మ అనిపించారు. జిల్లా కేంద్రం ఒంగోలులో యువతతో ముఖాముఖి కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందని రెండు రోజుల ముందుగానే ప్రకటించారు. ఈ కార్యక్రమానికి లోకేష్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో మధ్యాహ్నం ఒంగోలుకు చేరుకున్నారు. యువతతో ముఖాముఖి కార్యక్రమానికి చిన్నపాటి ప్రాంగణాన్నే సిద్ధం చేశారు. అయినా ఆ చిన్నపాటి ప్రాంగణం కూడా యువతలేక వెలవెలబోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే లోకేష్ యువగళం ముఖాముఖి కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ షోగా మారిపోయింది. ఆ ఫ్లాప్ షోకు ఒక జర్నలిస్టు కూడా యాంకర్‌గా వ్యవహరించారు. యువత రాకపోవటంతో లోకేష్ 3.15 గంటలపాటు బస్సులోనే వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అంటే మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సిన యువగళం ముఖాముఖి కార్యక్రమం సాయంత్రం 6.15 గంటలకు కానీ ప్రారంభం కాలేదు. ముందు నుంచీ యువత మాత్రమే లోనికి రావాలని ప్రకటించిన నిర్వాహకులు ముఖాముఖి కార్యక్రమానికి యువత కరువవడంతో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన కేడర్‌ను, నాయకులను బయట ఎవరున్నా లోనికి రావాలని మైకు ద్వారా అనౌన్స్‌మెంట్ చేయడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. 2014 నుంచి 2019 వరకు టీడీపీ కూటమి అధికారంలో ఉండీ కనిగిరి నిమ్జ్‌ను గాలికి వదిలేసిన లోకేష్ ఈసారి అధికారంలోకి వస్తే సంవత్సరం లోపే నిమ్జ్‌ను ఏర్పాటు చేస్తాననటంతో నవ్వులు విరబూశాయి. అధికారంలోకి వస్తే 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తానని, లేకుంటే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించడంతో అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదని ముఖాముఖికి వచ్చిన వారు ఒకరికొకరు చెప్పుకున్నారు. జీఓ అని స్పష్టంగా పలకలేక జియో.. జియో అని అనేక సార్లు అనడంతో అంతా నవ్వుకున్నారు. మధ్యలో ఒక అమ్మాయి లేచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అరాచకాలు చేస్తున్నారు అంటూనే...తాము అధికారంలోకి వస్తే అధికారులకు సినిమా చూపిస్తాను అంటున్నారు, అంటే అధికారంలోకి వస్తే మీరు కూడా అరాచకాలు చేస్తారా అని నిలదీయటంతో లోకేష్ ఖంగుతిన్నాడు. సమాధానం చెప్పలేక తడబడ్డాడు. అడ్డగోలుగా చేసిన అధికారులను వదిలేదిలేదని కరాఖండిగా చెప్పారు. చట్టాలను ఉల్లంఘించిన అధికారుల పేర్లు రెడ్ బుక్‌లో రాసుకున్నానని, అధికారంలోకి రాగానే వాళ్లకు సినిమా చూపిస్తానన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే సుప్రీం కోర్టు కేసులు పెట్టవద్దని చెప్పిందని వేరొకరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇచ్చి రాష్ట్రాన్ని శ్రీలంక అయిపోతుందని విమర్శిస్తున్నారు కదా...మీరు అధికారంలోకి వస్తే ఇంతకంటే ఎక్కువ పథకాలు ఇస్తామని అంటున్నారు, అప్పుడు శ్రీలంక కాకుండా సింగపూర్ ఎలా అవుతుంది అని ఒక యువతి నిలదీసింది. దీంతో సమాధానం చెప్పలేక లోకేష్ తటపటాయించారు. సీఏఏని అమలు చేయాలని చూస్తున్న బీజేపీతో మీరు కూటమి కట్టారు. మరి సీఏఏకు మద్దతు ఇస్తారా అని ఒక ముస్లిం యువకుడు నిలదీశాడు. మద్దతు ఇవ్వం అని సమాధానం చెప్పాడు లోకేష్. అటువంటప్పుడు బీజేపీతో పొత్తు ఎందుకు పెట్టుకున్నారని కూడా నిలదీశాడు. సమాధానం ఏం చెప్పాలో అర్థంకాక లోకేష్ నీళ్లు నమిలాడు. ప్రశ్నలకు సమాధానాల బదులు సోది చెప్పాడంటూ యువత మాట్లాడుకోవడం గమనార్హం.

తుస్సుమన్న బాలయ్య పర్యటన

- మద్దిపూడిలో మీటింగ్ సాగుతుండగానే కార్యకర్తలు జంప్
- సభ వద్దకు తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్న ఎఫ్‌ఎస్‌డీ అధికారులు
- సంతనూతలపాడులో బాలకృష్ణ ప్రసంగం అర్థం కాక తలపట్టుకున్న జనం

మద్దిపూడి/ సంతనూతలపాడు(చీమకుర్తి): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందుపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ మంగళవారం మద్దిపూడిలో నిర్వహించిన సభ తుస్సుమంది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో చాపర్‌లో మద్దిపూడి చేరుకున్న బాలకృష్ణ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద సాయంత్రం 5 గంటల వరకు కునుకు తీశారు. బాలయ్యను చూడాలని మద్దిపూడి గౌడాస్ కాలనీకి చెందిన అభిమానులు ఎండలో గంటల తరబడి టీడీపీ జెండాలు పట్టుకుని నిల్చున్నారు. వారిని చూసి కూడా బాలయ్య తన వాహనం ఆపకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. స్థానిక బ్రహ్మంగారి ఆలయం వద్ద బాలకృష్ణ బహిరంగ సభలో మాట్లాడుతుండగానే అందరూ ఇంటిబాట పట్టారు. దీంతో బాలకృష్ణ పొడిపొడిగా నాలుగు మాటలు చెప్పి వెళ్లిపోయారు. సభలో టీడీపీ కార్యకర్తలు మద్యం మత్తులో మునిగితేలారు. ఇదే సభ వద్దకు అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తులను ఎఫ్ఎస్‌డీ అధికారులు అదుపులోకి తీసుకుని 25 క్వార్టర్లు స్వాధీనం చేసుకున్నారని ఎస్సై శివబసవరాజు తెలిపారు.

- సంతనూతలపాడులో మంగళవారం రాత్రి సినీ నటుడు బాలకృష్ణ ప్రసంగం ప్రజలకు విసుపు పుట్టించింది. బాలకృష్ణ ప్రసంగం ప్రారంభించిన ఐదు నిమిషాలకే టీడీపీ కార్యకర్తలు ఇంటి బాట పట్టారు. కేడర్‌ను ఉత్సాహపరుస్తాడని ఆశించిన నేతలకూ భంగపాటు తప్పలేదు. సభ చివరలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను కూడా బాలకృష్ణ ప్రజలకు పరిచయం చేయలేకపోయారు. బైకులకు పెట్రోల్ టోకెన్లు ఇచ్చి యువతను సభకు రప్పించేందుకు టీడీపీ నాయకులు నానా తంటాలు పడినా ఆశించిన ఫలితం దక్కలేదు.



మద్దిపూడిలో మీటింగ్ నుంచి వెనుదిరిగిన జనం



ఎస్ఎన్‌పాడులో బాలకృష్ణ ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన కార్యకర్తలు

సంక్షేమ ప్రభుత్వానికి జై..



జిల్లెళ్లపాడులో టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

- జిల్లెళ్లపాడులో 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

వెలిగండ్ల: వైఎస్సార్‌సీపీలోకి వలసలు రోజురోజుకూ ఊపందుకుంటున్నాయని కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్ పేర్కొన్నారు. వెలిగండ్ల మండలంలోని జిల్లెళ్లపాడు గ్రామంలో మంగళవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లెళ్లపాడులో టీడీపీకి చెందిన 100 కుటుంబాలు మేడం లక్ష్మీనారాయణరెడ్డి, బొప్పరాజు హరికృష్ణ, ఏరువ వెంకటనారాయణరెడ్డి, శ్రీను, మేడం వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో దద్దాల నారాయణయాదవ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. కారుమంచి జార్జి, దానియేలు, దావీదు, ఇమ్మానియేలు, సాల్మన్, బాబు , ప్రభుకిరణ్, ఏలయ్య, మరియన్‌రావు, గురవయ్య, శెట్టి సత్యం, ఆదినారాయణ, నాగభూషణం, రామిరెడ్డి, విష్ణు నారాయణ, రోశయ్య, చెన్నయ్య, బాలయ్య, కొండయ్య, యరజాల బాలయ్య, బొప్పరాజు బాలచంద్ర, బాలప్రసాద్, బాలయ్య, షరీఫ్, విజయ, సంధ్య, గురవమ్మ, నాగలక్ష్మీ, గాయత్రి, సౌమ్య, సీతామహాలక్ష్మి, మేడం సుబ్బరత్నమ్మ, మేడం వసంత, మల్లెబోయిన కార్తీక్, గురవయ్య, పిచ్చయ్య, చినచెన్నయ్య, పెద చెన్నయ్య, చినతిరుపతయ్య, రావులపల్లి నాగార్జున, పెదతిరపతయ్య, మూలే రమణారెడ్డి, ఈర్ల వెంకటేశ్వర్లు, అతిరాజు తిరుపాలు, పెద తిరుపాలు, బొప్పరాజుమంగమ్మ తదితరులు పార్టీలో చేరారు. రామగోపాలపురం గ్రామానికి చెందిన బోగ్యం ప్రసాద్, కొప్పుల మణిక్య కిషోర్ టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ చైర్మెన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీ రామన మహాలక్ష్మీ, వైస్ ఎంపీపీ తాతపూడి మేరిపుష్ప, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.